ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

మంగళవారం, జూన్ 9, 2026

## విటల్వాడిల తీరిన తిప్పలు..


### రంగంలోకి దిగి సమస్య తీర్చిన మహాలక్ష్మి రామన్ గౌడ్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** నారాయణ గూడ విటల్‌వాడి పరిధిలోని సిటీ హోమ్స్, హెయిర్‌బస్ అపార్ట్‌మెంట్స్ మరియు చుట్టుపక్కల కాలనీల ప్రజల కష్టాలు తీరాయి. గత కొన్ని రోజులుగా నీళ్లు రాక.. ఒక్కో కుటుంబం ట్యాంకర్ల కోసం రూ. 2000 నుండి రూ. 3000 దాకా ఖర్చు పెడుతూ నానా ఇబ్బందులు పడ్డారు.

ఈ పంచాయితీని స్థానికులు మాజీ కార్పొరేటర్ శ్రీమతి మహాలక్ష్మి రామన్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె వెంటనే స్పందించారు. వాటర్స్ అధికారులతో మాట్లాడి, అర్జంటుగా సమస్యను పరిష్కరించాలని కోరారు.



కార్పొరేటర్ చొరవతోటి అధికారులు వెంటనే క్షేత్రస్థాయికి వచ్చి రిపేర్ పనులు చేయడంతో.. ప్రస్తుతం పూర్తి సరఫరా మళ్లీ మామూలైంది. సమస్యను పరిష్కరించిన వాటర్ వర్క్స్ అధికారులు త్వరగా, సహకరించిన మున్నవ్వర్‌కు ఈ సందర్భంగా బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.



ఏసీబీ సోదాల్లో షాక్.. ఈఎన్‌సీ మోహన్‌నాయక్ ఇంట్లో రూ.200 కోట్ల ఆస్తులు 2



భారత ఇంజనీరింగ్ అద్భుతం.. 'జోజిలా టన్నెల్ బ్రేక్ త్రూ' ను ప్రారంభించిన కేంద్ర మంత్రి.. 2



కాస్ట్లీ గిఫ్ట్ కోసం లవ్వాట.. అది అందగానే బ్రేకప్.. పాపం..టీగల్ అడ్వైజ్ కోరుతున్న బాధితుడు! 3




కాబోయే భార్యకు 50 గదుల కోట..కోట్ల ఆస్తి ఫ్రీ.. కానీ ఓ కండిషన్..! ఈ ముసలోడు మాములోడు కాదు..! 3

# పైసలు ఎక్కువైతే ఏందిగని..

# సుక్క ముక్కకు నో కాంప్రమైజ్..!

- తెలంగాణల మళ్లీ మందు ధరలు పెంపు.!..ఈ నెల 15 నుంచే 'కిక్'..
- బీర్లకు నో చేంజ్.. బాటిల్‌పై రూ. 80 నుంచి రూ. 120 దాకా బాదుడు!
- "కోడి కూర కిలో 350 దాటినా తింటలేమా..
- మందు రేట్లు పెరిగితే తాగడం బంద్ చేస్తామా..?
- బాధల అప్పో సప్పో చేసి ఓ పెగ్గు ఎక్కువే ఏస్తం..
- తగ్గేదేలే అంటున్న..ట్యాక్స్ పేయర్స్




**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** తెలంగాణల మందు బాబులకు సర్కారు గట్టి షాకే ఇచ్చేందుకు రెడీ అయింది. ఇప్పటికే ఎండ దెబ్బకు తట్టుకోలేక అల్లాడిపోతుంటే.. ఇప్పుడు మందు ధరల దెబ్బ కొట్టేందుకు ఫైల్ రెడీ చేశారు. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వబోతున్నట్లు ఎక్సైజ్ శాఖల ముచ్చట నడుస్తోంది. ముడిసరుకులు, రవాణా ఖర్చులు పెరిగాయి మొర్రో అంటూ లిక్కర్ కంపెనీలు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో.. ఓ త్రిసభ్య కమిటీని వేసి మరి పంచాయితీ పెట్టారు. ఈ కమిటీ లెక్కల ప్రకారం ఈ నెల 15 నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చే ఛాన్స్ ఉందట.

### ఎంత పెరుగుతుందంటే?

సాధారణ బ్రాండ్లు ఫుల్ బాటిల్కు రూ. 80 దాకా, ప్రీమియం బ్రాండ్లు రూ. 90 దాకా ధరలు పెరిగే అవకాశముంది. ఇక. కాస్ట్లీ బ్రాండ్లు (హై-ఎండ్) రూ. 120 పైగానే బాదనున్నారు. గతేడాదే పెంచినం కాబట్టి బీర్ల ధరలను మాత్రం తాకట్లేదట.. మందు బాబులకు ఇదొక్కటే ఊరట

### 'ఈ బాధల ఇంకో పెగ్గు ఎక్కువనే ఏస్తాం'.. మందు బాబులు!

ధరలు పెరుగుతున్నయ్ అనగానే మనోళ్లు అస్సలు తగ్గలేదు. "తెలంగాణ అంటేనే సుక్కా-ముక్కా.. ఇందులో నో కాంప్రమైజ్" అంటూ మందు బాబులు రివర్స్ లో డైలాగులు కొడుతున్నారు. "కోడి కూర కిలో 350 దాటినా క్యూ కట్టి కొని తింటలేమా.. ఇప్పుడు మందు రేట్లు పెరిగితే తాగడం బంద్ చేస్తామా ఏంది? ఈ రేట్లు పెంచిన బాధల అప్పో సప్పో చేసి ఇంకో పెగ్గు ఎక్కువే ఏస్తాం కానీ తగ్గేదే లే" అంటూ సెటైర్లు వేస్తున్నారు.

### సర్కారు ఖజానాకు నోట్ల వర్షం..

ఈ ధరల పెంపు వల్ల తాగేటోళ్లకు జేబులు ఖాళీ అయినా.. సర్కారు ఖజానాకు మాత్రం కాసుల వర్షం కురవనుంది.

నెలకు రూ. 200 కోట్ల నుంచి రూ. 250 కోట్ల దాకా అదనపు ఆదాయం రానుందట. అంటే ఏడాదికి గట్టిగా రూ.2,400 కోట్ల నుంచి రూ.3,000 కోట్లు సర్కారు ఖాతాలో పడతాయన్నమాట. మొత్తం మీద ఈ నెల 15 నుంచి మందు షాపుల దగ్గర జేబులు మరికాస్త గుల్ల కావడం ఖాయంగా మారింది. అధికారిక ప్రకటన రావడమే తరువాయి!


## కాచిగూడల ఘోర విషాదం...

- బాసర గోదావరిల ముగ్గురు అన్నదమ్ములు మునిగి గల్లంతు!
- అమ్మవారి దర్శనానికని పోతే.. అనంత లోకాలలకు
- ఒకే కుటుంబంలో తీరని శోకం!


**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** బాసర పుణ్యక్షేత్రం గుండెల్లో పగిలేటి ఘోర ప్రమాదం జరిగింది. చదువుల తల్లి జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నామని ఎంతో సంబురంగా వచ్చిన ఓ కుటుంబంలో గోదావరి నది పెను విషాదాన్ని నింపింది. పుణ్యస్నానాలు చేద్దామని నదిలోకి దిగిన ముగ్గురు అన్నదమ్ములు నీళ్లలో మునిగి గల్లంతయ్యారు. ఈ దారుణ సంఘటనతో బాసర ఘాట్ దగ్గర ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

### అసలేం జరిగిందంటే..?

హైదరాబాద్ కాచిగూడలోని చప్పల్ బజార్‌కు చెందిన ఓ కుటుంబం అమ్మవారి దర్శనం కోసం ఇవాళ పొద్దున్నే బాసరకు చేరుకుంది. గుడికి పోయే ముందర గోదావరిల పవిత్ర స్నానం చేద్దామని కుటుంబ సభ్యులంతా నది దగ్గరికి వెళ్లిపోయారు. అయితే,



కుటుంబానికి ఆసరాగా ఉండాల్సిన ముగ్గురు యువకులు ఒక్కసారిగా నీళ్లలో మునిగిపోయారు. గల్లంతైన వారిని మన కాచిగూడ చప్పల్ బజార్ కు చెందిన అన్నదమ్ములు చంద్రశేఖర్ (38) , రామచందర్ (36) , మల్లేశ్ కుమార్ (31) గా గుర్తించారు. కండ్ల ముందే కొడుకులు నీళ్ల పాలు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. "అమ్మా సరస్వతీ.. నీ దర్శనానికి వస్తే మా బిడ్డలను మింగేస్తవా.. ఒక్కసారి మా పిల్లలను మాకు అప్పగించవా" అంటూ వాళ్లు ఏడుస్తున్న తీరు అక్కడ ఉన్నోళ్లందరి చేత కన్నీళ్లు పెట్టించింది.కాగా..ప్రమాదం జరిగిన వెంటనే అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు నదిలోకి దూకి యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు అన్నదమ్ములు ఇలా నదిలో మునిగిపోవడంతో కాచిగూడ చప్పల్ బజార్‌లో కూడా విషాద ఛాయలు అలుముకున్నాయి.



## ఫస్ట్ వానకే మునిగి తేలిన శాంతినగర్..

### ఇండ్లల్ల నీళ్లు చేరి జనం నానా తిప్పలు!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 9:** వానకాలం ఇప్పుడిప్పుడే మొదలైందో లేదో.. అప్పుడే నగరంలో ముంపు తిప్పలు మొదలయ్యాయి. ఇయ్యాల పడ్డ ఫస్ట్ వానకే గోల్నాక డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీ పూర్తిగా మునిగిపోయింది. డ్రైనేజీలు సరిగ్గా లేకపోవడం, నాలాల నిధుల ముచ్చట కాగితాలకే పరిమితం కావడం.. వాన నీళ్లన్నీ రోడ్ల మీదికి వచ్చి చేరాయి. చూస్తుండగానే కాలనీ అంతా చెరువును తలపించింది.

భారీ వర్షానికి నాలాలు పొంగి పొర్లడంతో.. శాంతినగర్‌లోని కింది ఇండ్లన్నింటిలోకి మోకాళ్ల నీళ్లు చేరాయి. ఇండ్లలోకి నీళ్లు వస్తుండడంతో చిన్న పిల్లలు, ముసలోళ్లను పట్టుకుని జనం ఏం చేయాలో తెలియక నానా ఇబ్బందులు పడ్డారు. ఈ దారుణమైన పరిస్థితిపై శాంతినగర్ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ఇంకా భారీ వర్షాలు పడనే లేదు.. జస్ట్ ఫస్ట్ వానకే మా ఇండ్లు మునిగిపోతే.. రాబోయే వానకాలం అంతా మేము ఎట్లా బతకాలె? మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్నా?" అని సర్కార్ను, జీహెచ్‌సీ అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులు నిద్రమత్తు వీడి..శాంతినగర్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేదంటే ఊరుకునేది లేదని కాలనీ వాసులు హెచ్చరిస్తున్నారు.



## అజ్మీర్ దర్గాకు షహీన్ బేగం..


### 'చాదర్' అందించి వీడ్కోలు పలికిన విజయ్ కుమార్ గౌడ్!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు షహీన్ బేగం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అజ్మీర్ దర్గాకు బయలుదేరారు. ఈ సందర్భంగా అంబర్‌పేట్ తాజా మాజీ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ ఆమెను ప్రత్యేకంగా వీడ్కోలు పలికారు. అజ్మీర్ దర్గాలో సమర్పించాల్సిందిగా విజయ్ కుమార్ గౌడ్ ఆమెకు ఒక పవిత్రమైన 'చాదర్'ను అందించారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీల ఎంతో కాలంగా చురుగ్గా పనిచేస్తున్న సీనియర్ నాయకురాలు షహీన్ బేగం అజ్మీర్ దర్గాకు వెళ్తుండడం సంతోషంగా ఉందన్నారు. మన ప్రాంత ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈ చాదర్‌ను సమర్పించాలని ఆమెను కోరినట్లు తెలిపారు. షహీన్ బేగం అజ్మీర్ ప్రయాణం సుఖరూపంగా సాగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లవంగు ఆంజనేయులు, మహేష్ ముదిరాజ్, మోసిన్, షానూర్, రఫిక్, సంతోష్ చారి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని షహీన్ బేగం కు శుభాకాంక్షలు తెలిపారు.

## నత్తనడకన వంతెన పనులు..

### అంబర్‌పేట ప్రజలపై ఎందుకింత వివక్ష: మల్లికార్జున్ యాదవ్

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** మూసారాంబాగ్ వంతెన నిర్మాణం పనులలపై బీఆర్ఎస్ ఉద్యమనేత మల్లికార్జున్ యాదవ్ ధ్వ.జమెత్తాడు. భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున, అంబర్‌పేట్ నియోజక వర్గంపై ప్రభుత్వం చూపుతున్న వివక్షను ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. గత ఏడు వచ్చిన వరద లకు కొత్తగా కడుతున్న మూసారాంబాగ్ వంతెన కొట్టుకుపోయిన ఇప్పటికీ గుర్తుచేస్తూ.. ఆ వంతెన పనులు నత్తనడకన సాగడం సిగ్గు చేటన్నారు. ప్రస్తుతం అక్కడ ఉన్న పాత వంతెన మీద చిన్న సందు గుండానే ప్రజలు, వాహనదారులు నడుస్తున్నారని.. ఇది చాలా ప్రమాదకరంగా మారిందని మల్లికార్జున్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే వర్షాలకు అక్కడ ఏమైనా జరగరాని ఘోరం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని.. రాష్ట్ర ప్రభుత్వమా? లేక బల్దియా అధికారులా? అని ఆయన నిలదీశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం తగదన్నారు.




## సిటీల దంచికొడుతున్న వాన..

### చెట్లు విరిగిపడి, కరెంట్ పోయి జనం తిప్పలు!

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** నగరంలో వాన దేవుడు ఒక్కసారిగా ప్రతాపం చూపించాడు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఇవాళ సాయంత్రం పొద్దుగూకే టైంకివాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులు, గట్టి ఈదురుగాలులతో వాన పడడంతో ఆఫీసులకెళ్లి ఇండ్లకు పోయేటోళ్లు, వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో ట్రాఫిక్ జామ్ అయి ఎక్కడికక్కడ బండ్లు నిలిచిపోయాయి.

నగరంలో వాన పడని ఏరియా అంటూ లేదనే చెప్పాలె. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్ దిక్కు గట్టిగా కొట్టింది. అట్లనే అంబర్ పేట, ముషీరాబాద్, చంపాపేట్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, సైదాబాద్, కోఠి,



సుల్తాన్‌బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, నారాయణగూడ, హిమాయత్‌నగర్, హైదర్‌గూడ, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్ ఏరియాల వాన బీభత్సం సృష్టించింది.

ఇక సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, జేబీఎస్, బేగంపేట ప్రాంతాల్లో ఈదురుగాలులు ముంచెత్తాయి. గాలికి తట్టుకోలేక హైదర్‌గూడలో ఓ పెద్ద చెట్టు రోడ్డుపై విరిగిపడడంతో ట్రాఫిక్ అంతా జామ్ అయింది. రామ్‌నగర్ వీఎస్టీ రోడ్డులో మరో చెట్టు నేలకొరిగింది. ముషీరాబాద్‌లో గట్టిగా గాలులు వీచడంతో కరెంట్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చీకట్ల బస్తీ జనం నానా అవస్థలు పడుతున్నారు. జీహెచ్‌సీ డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి రోడ్లపై పడ్డ చెట్లను తొలగిస్తున్నారు.


## నీళ్ల ప్రెషర్ రాక బస్తీ జనం తిప్పలు..

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీఆర్ఎస్ నేత

### 'తొందరనే సమస్య తీరుస్తాం'..

### హామీ ఇచ్చిన వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డి

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 9:** గోల్నాక డివిజన్ పరిధిలోని తులసి రామ్ నగర్ లంక బస్తీలో గత కొన్ని రోజులుగా తాగు నీటి సమస్యతో జనం నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నల్లా నీళ్లలో ప్రెషర్ లేకపోవడంతో సగం మందికి నీళ్లు అందక తిప్పలు తప్పడం లేదు. ఈ పంచాయితీపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో.. బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్ ఇవాళ బస్తీలో పర్యటించిండు. నీళ్ల సమస్యను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.



బస్తీ వాసుల కష్టాలను చూసిన దూసరి శ్రీనివాస్ గౌడ్.. వెంటనే వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నీళ్ల ప్రెషర్ సమస్యతో పాటు కాలనీలో ఉన్న ఇతర వాటర్ ప్రాబ్లమ్స్ గురించి వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్ రెడ్డితో ఫోన్లు మాట్లాడి నిలదీశారు. దీనికి జీఎం శ్రీధర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ.. లంక బస్తీలో ఉన్న వాటర్ సమస్యలను టెక్నికల్‌గా పరిశీలించి, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి తొందరలోనే నీళ్ల తిప్పలు తీరుస్తామని గట్టి హామీ ఇచ్చారు. సమస్యపై వెంటనే స్పందించి, అధికారులతో మాట్లాడి నమ్మకం కలిగించిన దూసరి శ్రీనివాస్ గౌడ్‌కు బస్తీ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

## నేషనల్ లెవెల్‌ల తెలంగాణ పోరగాండ్ల జాతర.. కిక్‌బాక్సింగ్‌ల ఏకంగా 19 మెడల్స్..!

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 9:** నేషనల్ లెవెల్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో మన తెలంగాణ క్రీడాకారులు అద్భుతమైన సత్తా చాటారు. ఒడిశా రాష్ట్రంలో జరిగిన "వాకో ఇండియా జూనియర్ నేషనల్ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ – 2026" పోటీలలో తెలంగాణ నుంచి పాల్గొన్న క్రీడాకారులు ఏకంగా 19 పతకాలతో (6 గోల్డ్, 3 సిల్వర్, 10 బ్రాంజ్ మెడల్స్) అపూర్వ విజయాన్ని అందుకున్నారు. జూనియర్ నేషనల్స్ చరిత్రలో మన రాష్ట్రానికి ఇన్ని నేషనల్ మెడల్స్ రావడం ఇదే మొదటిసారి, స్థాయిలో తెలంగాణ 8వ స్థానంలో నిలిచింది.ఈ చరిత్రాత్మక విజయం సాధించి సిటీకి తిరిగొచ్చిన క్రీడాకారులను ఇవాళ ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాల దేవి ప్రత్యేకంగా కలిసి అభినందించారు. క్రీడాకారుల మెడల్స్, సర్టిఫికెట్లను చూసి మురిసిపోయిన ఆమె.. భవిష్యత్తులో దేశం గర్వించేలా మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అనిత, తెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సి. రామాంజనేయులు, సెక్రటరీ ఎం. మహిపాల్‌తో పాటు పిల్లలను విజేతలుగా నిలిపిన కోచ్‌లు ముజాహిద్, లక్ష్మణ్, మల్లేష్, ప్రవీణ్, మణికంఠ, కుమార్ కొనసాగుతున్నారు.



ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/



## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్..
# బలపడిన రూపాయి..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం చల్లబడి, శాంతి నెలకొంటుందనే ఆశలు చిగురించడంతో అంతర్జాతీయ మార్కెట్లలో వచ్చిన జోష్ దేశీయ స్టాక్ మార్కెట్‌ను కూడా లాభాల బాట పట్టించింది. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య ఉద్రిక్తతలు తాత్కాలికంగా తగ్గడం , అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దిగిరావడం వంటి సానుకూల పరిణామాలు ఇన్వెస్టర్లలో సరికొత్త నూతనోత్తేజాన్ని నింపాయి. ఈ సానుకూల సెంటిమెంట్ కారణంగా ట్రేడింగ్ సమయంలో ఒక దశలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 450 పాయింట్లకు పైగా దూసుకెళ్లగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ యాభై కూడా సుమారు 150 పాయింట్ల మేర లాభపడింది. అయితే, ఆ తర్వాత స్వల్ప లాభాల స్వీకరణ జరిగినప్పటికీ, మార్కెట్లు ముగిసే సమయానికి ఇరు సూచీలు అర శాతానికి పైగా పటిష్టమైన లాభాలను నిలబెట్టుకున్నాయి. మార్కెట్ ముగింపు నాటి అధికారిక వివరాల ప్రకారం.. సెన్సెక్స్ 394 పాయింట్లు పెరిగి 73,918 స్థాయి వద్ద ముగియగా, నిఫ్టీ యాభై సూచీ 119 లాభపడి 23,242 స్థాయి వద్ద స్థిరపడింది.

# వందకు చేరిన ఎబోలా మృతులు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:**

ఆఫ్రికాలో ఎబోలా మరణాలు 100 కు చేరాయి. ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా వైరస్ మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. అధికారిక గణాంకాల ప్రకార.. జూన్ 8 నాటికి అక్కడ ఎబోలా పాజిటివ్ కేసుల సంఖ్య 550కి చేరగా, ఇప్పటివరకు



101 మంది మరణించారు. కేవలం గత 24 గంటల్లోనే కొత్తగా 35 పాజిటివ్ కేసులు, 10 మరణాలు నమోదు కావడం వ్యాధి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ కొత్త కేసులు అత్యధికంగా 'ఇటురి' ప్రావిన్స్‌లోనే వెలుగుచూస్తున్నాయి. కాంగోలో నెలకొన్న రాజకీయ అస్థిరత, స్థానిక సాయుధ గ్రూపుల ఘర్షణల వల్ల వైద్య సహాయం అందించడం, వ్యాధిని నియంత్రించడం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలకు పెద్ద సవాలుగా మారింది. కాంగో సరిహద్దులు దాటి పొరుగు దేశమైన ఉగాండాలోనూ కొన్ని ఎబోలా కేసులు నమోదయ్యాయి.

కాంగో నుంచి ఉగాండాకు ప్రయాణించిన వారిలోనే ఈ ఇన్ఫెక్షన్ లక్షణాలు బయటపడటంతో వైరస్ ఇతర దేశాలకు వ్యాపించే ప్రమాదం పొంచివుంది. ఈ తీవ్ర పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ , ఈ ఎబోలా వ్యాప్తిని 'అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి' గా ప్రకటించింది. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న 'బుందిబుగ్యో' స్ట్రెయిన్‌కు మార్కెట్‌లో నిర్దిష్టమైన వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడం శాస్త్రవేత్తలను మరింత కలవరపెడుతోంది.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా
# మారాయి: రాంచందర్ రావు



**ఇయ్యాల్టి న్యూస్, యాదాద్రి, జూన్ 9:** తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు.

# ఏసీబీ సోదాల్లో షాక్..
## ఈఎన్‌సీ మోహన్‌నాయక్ ఇంట్లో రూ.200 కోట్ల ఆస్తులు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 9:**


ఆర్అండ్‌బీ (రోడ్లు భవనాల శాఖ) ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) మోహన్ నాయక్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టారని తెలిసిందే. మంగళవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని 11 చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగించిన ఏసీబీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లు, నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు.కాగా



ఈ తనిఖీల్లో మోహన్‌నాయక్‌కు రూ.200 కోట్ల ఆస్తులు గుర్తించారు. మోహన్‌నాయక్ ఇంట్లో రూ.60 లక్షల నగదుతో పాటు రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు గుర్తించారు. మోహన్‌నాయక్‌కు హైదరాబాద్‌లో పలు ప్లాట్లు, నిజామాబాద్‌లో వ్యవసాయ భూమి, అత్యంత ఖరీదైన విల్లాతో, అపార్ట్‌మెంట్, ఖాళీ స్థలాలు, ఫామ్ హౌజ్‌లు, విల్లాలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన టెండర్లలో కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించే ప్రక్రియలో అక్రమాలు చేసినట్టుగా మోహన్ నాయక్‌పై గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది

# హోర్ముజ్ జలసంధి వద్ద కూలిన అపాచీ హెలికాప్టర్



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** అమెరికా సైన్యానికి చెందిన అపాచీ అటాక్ హెలికాప్టర్ హోర్ముజ్ జలసంధి వద్ద కూలింది. ఆ హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. మరో వైపు ఇరాన్‌తో వార్‌లో వ్యూహాత్మకంగా మారిన హోర్ముజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. మంగళవారం ఆ హెలికాప్టర్ కూలింది. కానీ దేని వల్ల ఆ ఘటన జరిగిందో ఇంకా తెలియదు. రెండు రోజుల క్రితం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి దాడులు జరిగిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎన్‌బీఏ ఫైనల్స్ మ్యాచ్ వీక్షించిన ట్రంప్.. న్యూయార్క్ ఎయిర్‌పోర్టు వద్ద జర్నలిస్టులతో మాట్లాడుతూ పైలట్లు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. ఎవరికీ గాయాలు కాలేదన్నారు. ఆ ఘటనపై ఇవాళ పూర్తి వివరాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఏదేమైనా పైలట్లు క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు. అపాచీ హెలికాప్టర్ కూలిన ఘటనపై అమెరికా మిలిటరీకి చెందిన సెంట్రల్ కమాండ్ కానీ, రక్షణ శాఖ కానీ ఎటువంటి ప్రకటన చేయలేదు.

# పాతబస్తీ మెట్రోపై బిగ్ అప్డేట్.. ప్రాజెక్టుకు లైన్ క్లియర్..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 9:**

పాత బస్తీ మెట్రోపై బిగ్ అప్డేట్ వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పాతబస్తీ మెట్రో ప్రాజెక్టుపై ఎప్పటినుంచో ఫోకస్ పెట్టింది. వేగవంతంగా దీనిని పట్టాలెక్కించే విధంగా అడుగులు వేస్తోంది. సెకండ్ ఫేజ్‌లో భాగంగా పాత బస్తీలో మెట్రో నిర్మాణం చేపట్టనుండగా.. ఇందుకు సంబంధించి పనులు వేగవంతమయ్యాయి. అందులో భాగంగా తాజాగా మెట్రో అధికారులు కీలక అప్డేట్ ఇచ్చారు. ఈ మెట్రో ప్రాజెక్ట్ కోసం భూసేకరణ పనులు దాదాపుగా పూర్తయినట్లు అధికారులు స్పష్టం చేశారు. ఇందుకోసం మొత్తం 888 ఆస్తులు సేకరించాల్సి ఉండగా.. 825 ఆస్తుల సేకరణ పూర్తయినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు కావాల్సిన భూమిలో దాదాపు 93 శాతం భూసేకరణ పూర్తయినట్లు పేర్కొన్నారు. ఈ భూమిని ఇప్పటికే అధికారులు స్వాధీనం చేసుకోగా.. ఆస్తులు నష్టపోయినవారికి ప్రభుత్వం పరిహారం కింద ఇప్పటికే రూ.820 కోట్లు చెల్లించింది. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తులలో ఉన్న భవనాలను అధికారులు కూల్చివేత ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పాటు



టెండర్లను కూడా ఆహ్వానించారు. పనుల పర్యవేక్షణ, సాంకేతిక సలహాల కోసం కన్సల్టెన్సీ నియామకం కోసం టెండర్లను పిలిచారు. త్వరలోనే టెండర్ ఓకే చేయనుండగా.. అనంతరం నిర్మాణ పనులు మొదలుపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. మెట్రో అందుబాటులోకి వస్తే రానున్న రోజుల్లో పాతబస్తీ రూపురేఖలే మారనున్నాయి. భూసేకణ ప్రక్రియ దాదాపుగా పూర్తి కావడంతో మెట్రో ప్రాజెక్టు త్వరలో పట్టాలెక్కనుందని చెప్పవచ్చు. దాదాపు 10 ఆస్తులకు సంబంధించి కోర్టులో కేసులు నడుస్తుండగా.. మరికొన్ని స్థలాలకు సంబంధించి వివాదాలపై క్లారిటీ రావాల్సి ఉంది.పాతబస్తీ మెట్రో 7.5 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు ఉంటుంది. ఎంజీబీఎస్ నుంచి దారుల్ షిఫా, పురానీహవేలీ, అలీజా కోట్ల, హరిబౌలి, షాలిబండ, షంషీర్ గంజ్, ఫలక్ నుమా మీదుగా చంద్రాయణగుట్ట వరకు ఉంటుది. మార్గం మధ్యలో దాదాపు 105 చారిత్రక, మతపరమైన కట్టాలు ఉన్నాయి.



# హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు: భట్టి విక్రమార్క

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు.పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు.



# భారత ఇంజినీరింగ్ అద్భుతం..
## 'జోజిలా టన్నెల్ బ్రేక్ త్రూ'ను ప్రారంభించిన కేంద్ర మంత్రి..

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** భారతదేశ మౌలిక సదుపాయాల రంగంలో ఒక అద్భుతమైన చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. కాశ్మీర్, లడఖ్ మధ్య దశాబ్దాల నాటి సర్వకాలీన అనుసంధానత కల నెరవేరింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాలను కలిపే అత్యంత ప్రతిష్టాత్మక 'జోజిలా టన్నెల్'ప్రాజెక్ట్ ఫైనల్ బ్రేక్ త్రూను కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రారంభించారు. దేశ రక్షణ రంగంతో పాటు పౌర రవాణాలో సరికొత్త విప్లవానికి ఈ ప్రాజెక్ట్ వేదికగా నిలిచింది. సముద్ర మట్టానికి ఏకంగా 11,578 అడుగుల అసాధారణ ఎత్తులో నిర్మించిన ఈ సొరంగం.. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న 'అతి పొడవైన సింగిల్-ట్యూబ్ బై-డైరెక్షనల్' టన్నెల్‌గా సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈ ప్రధాన సొరంగం పొడవు 13.153 కిలోమీటర్లు కాగా, అప్రోచ్ రోడ్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో కలిపి మొత్తం ప్రాజెక్ట్ పొడవు 30.894 కిలోమీటర్లుగా ఉంది. వెర్టికల్ షాఫ్ట్‌లు, నిల్‌గ్రార్ జంట సొరంగాలు, మంచు తాకిడిని తట్టుకునే 'స్నో గ్యాలరీలు' ఈ ప్రాజెక్ట్‌లో కీలక నిర్మాణాలుగా నిలిచాయి. చైనా, పాకిస్థాన్ సరిహద్దులకు ఆనుకుని ఉండే ద్రాస్, కార్గిల్, లేహ్ వంటి వ్యూహాత్మక, సున్నితమైన సరిహద్దు ప్రాంతాలకు ఈ టన్నెల్ ఒక రక్షణ కవచంలా మారనుంది. శీతాకాలంలో కూడా భారత సైన్యాన్ని, భారీ యుద్ధ సామాగ్రిని, లాజిస్టిక్స్ సామగ్రిని ఎలాంటి ఆటంకాలు లేకుండా సరిహద్దులకు తరలించడానికి ఇది సైన్యానికి ఎంతో కీలకంగా మారనుంది.


# జీతాలు ఇవ్వకుండా వేధింపులు.. ఉసురు తగులుతుంది : హరీశ్ రావు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 9:**


మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు అంగన్ వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల నీకున్న గౌరవాన్ని నిలబెట్టుకో అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు హితవు పలికారు. ఈ మేరకు హరీశ్ రావు ఓ ప్రకటన విడుదల చేశారు.

రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల అంగన్ వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా..? నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్ వాడీలను వేదిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుందన్నారు.

మహిళా మంత్రిగా ఉన్న సీతక్క సాటి



మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమని హరీశ్ రావు పేర్కొన్నారు.



# దశాబ్దాల విధానానికి స్వస్తి..
## అణుబాంబులను మోహరించిన భారత్!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** భారతదేశ రక్షణ, అణు ఆయుధ విధానంలో చరిత్రాత్మక మార్పు చోటుచేసుకున్నట్లు సమాచారం. దేశ రక్షణ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భారత్ ప్రయోగించేందుకు సిద్ధంగా ఉండేలా 12 అణుబాంబులను మోహరించినట్లు అంతర్జాతీయ ఆయుధాల పర్యవేక్షణ సంస్థ 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సిప్రి) తన తాజా నివేదికలో సంచలన విషయాన్ని వెల్లడించింది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణుబాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది.జనవరి 2026 నాటికి భారతదేశం వద్ద ఉన్న మొత్తం అణు ఆయుధాల సంఖ్య దాదాపు 190కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య కొద్దిగా పెరిగింది. వీటిని భూమి, గగనతలం, సముద్రం.. ఈ మూడు మార్గాల ద్వారా ప్రయోగించేలా భారత్ తన సామర్థ్యాన్ని ఆధునీకరించుకుంది. ముఖ్యంగా అణు జలాంతర్గాముల్లో ఈ సరికొత్త వ్యూహాత్మక అణుబాంబులను మోహరించి సముద్ర గర్భంలో నిరంతర నిఘా నిర్వహిస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది.

## మరోసారి నెత్తురోడిన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ..
# పాక్ సైన్యం కాల్పుల్లో 30 మంది మృతి

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ మరోసారి నెత్తురోడింది. అల్లర్లలో 30 మంది మృతి చెందగా, 200 మందికి పైగా గాయాలయ్యాయి. అవామీ యాక్షన్ కమిటీపై నిషేధానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలకు దిగారు. దీంతో పాకిస్థాన్ సైన్యం పీవోకే వాసులపై కాల్పులు జరిపింది. ఈ ఘటనపై ఆక్రమిత కశ్మీర్ పాకిస్థాన్ సైన్యం తీరుపై భగ్గుమన్నారు. పలువురు ఆందోళనకారులను అరెస్టు చేశారు. సైన్యం కాల్పుల్లో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉండవచ్చన్న పీవోకే వాసులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కావాలనే వివరాలు చెప్పడం లేదని వారు వాదిస్తున్నారు. 45 స్థానాలున్న అసెంబ్లీలో కశ్మీరేతర పాక్ ప్రజలకు 12 సీట్లు ఇవ్వాలని పాక్ చట్టం చేయడాన్ని పౌరసమాజ కూటమి (జేఏఏసీ)



ప్రశ్నించింది. దీంతో ఉగ్రవాదులతో లింక్‌లు ఉన్నాయంటూ జేఏఏసీని పాక్ ప్రభుత్వం నిషేధించడం అల్లర్లకు కారణమైంది.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

జనరల్ న్యూస్ | చూసి ముర్వాలే | మంగళవారం, జూన్ 9, 2026



# కాబోయే భార్యకు 50 గదుల కోట..కోట్ల ఆస్తి ఫ్రీ.. కానీ ఓ కండిషన్..!

### ఈ ముసలోడు మాములోడు కాదు..!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** లండన్ వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని నిరూపిస్తూ, బ్రిటన్‌కు చెందిన 79 ఏళ్ల కోటీశ్వరుడు, ప్రముఖ వ్యాపారవేత్త సర్ బెంజమిన్ స్లేడ్ తనకు కాబోయే భార్య కోసం వెతుకులాట కోసం. తనను పెళ్లాడే యువతికి కోట్లాది రూపాయల ఆస్తితో పాటు లగ్జరీ జీవితాన్ని ఆఫర్ చేస్తూ ఆయన పెట్టిన కండిషన్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతోంది.బ్రిటన్‌లోని సోమర్‌సెట్‌లో ఉన్న శతాబ్దాల నాటి చరిత్రాత్మక 'మాన్‌సెల్ హౌస్' (50 గదుల రాజభవనం)కు బెంజమిన్ యజమాని. 80 ఏళ్లకు చేరువలో ఉన్న ఆయనకు ఇప్పటివరకు వారసులు లేరు. దాని తర్వాత తన తర్వాత ఈ భారీ సామ్రాజ్యాన్ని, ఆస్తులను చూసుకోవడానికి, తన వంశాన్ని ముందుకు తీసుకెళ్లడానికి (పిల్లలను కనడానికి) సిద్ధంగా ఉన్న ఒక యువతి కోసం ఆయన రూపొందించారు.తనను పెళ్లి చేసుకునే మహిళకు 50 గదుల కోటలో రాణిలా బతికే అవకాశం, ఏడాదికి కోట్ల రూపాయల ప్యాకెట్ మనీ, ఖరీదైన లగ్జరీ కార్లు, వీఐపీ లైఫ్ స్టైల్ ఇస్తానని ఆయన పేర్కొన్నారు.



ఈ పర్ఫెక్ట్ పార్టనర్ కోసం ఆయన డేటింగ్ సైట్లలో ప్రొఫైల్స్ క్రియేట్ చేయడమే కాకుండా, టీవీ షోలలో కూడా ప్రకటనలు ఇస్తున్నారు. కేవలం తన డబ్బు చూసి వచ్చేవాళ్లు కాకుండా, నిజమైన తోడుగా ఉంటూ తన వంశాన్ని నిలబెట్టే అమ్మాయి కావాలని ఆయన కోరుకుంటున్నారు.



# తళుకుమన్నది కులుకుల తార..

## కొంటె చూపులతో భాగ్యశ్రీ భోర్సే..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:** "తళుకుమన్నది కులుకుల తార..భాగ్యశ్రీ భోర్సే.." అంటూ సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ ముద్దుగుమ్మ తాజా లుక్ నిజంగానే ఫ్యాన్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. టాలీవుడ్‌లో 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, తన గ్లామర్ మరియు ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో కుర్రకారుని గుండెల్లో గంటలు కొట్టేసిన భాగ్యశ్రీ భోర్సే ప్రస్తుత లుక్‌లో అదరగొడుతోంది.



# ఆగస్టు 28న శ్రద్ధా కపూర్ 'ఈత' విడుదల!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:** 'స్త్రీ-2' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత బాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఈత' (ఈత) విడుదల తేదీ ఖరారైంది. ఈ రక్షాబంధన్ పండుగ కానుకగా ఈ ఏడాది 28న ప్రపంచ థియేటర్లలో విడుదల చేయబడ్డ మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.ప్రసిద్ధ మహారాష్ట్ర జానపద, లావణీ నృత్య కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్కర్ జీవిత కథ ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 1940 నుండి 1990 కాలం నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ ఎంతో శక్తివంతమైన, భావోద్వేగభరితమైన పాత్రలో కనిపించనుంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మేడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దినేష్ విజన్ ఉన్నారు. రణదీప్ హుడా, మహ్మద్ జీషన్ అయ్యూబ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించారు.




# రూ.2400 కోట్ల భారీ స్కామ్

## - నటి సన్నీ లియోన్‌కు సీఐడీ నోటీసులు!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:** కర్ణాటకకు చెందిన 'శివం అసోసియేట్స్' రూ. 2,400 కోట్ల భారీ పోంజీ (ఆర్థిక) కుంభకోణం కేసులో బాలీవుడ్ నటి సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. యజమాని శివానంద నీలణ్ణవర సంస్థ ఎక్కువ వడ్డీ ఆశ చూపి ప్రజల నుండి అక్రమంగా రూ. 2400 కోట్ల డిపాజిట్లు వసూలు చేసి మోసానికి పాల్పడ్డాడు. అయితే, ఇతను 2023లో నిర్మించిన 'ఛాంపియన్' అనే సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ చేసినందుకు గాను సన్నీ లియోన్‌కు రూ. 1 కోటి పారితోషికం ఇచ్చినట్లు సీఐడీ విచారణలో తేలింది. ప్రజల నుండి దోచుకున్న అక్రమ సొమ్మునే ఆమెకు రెమ్యూనరేషన్‌గా ఇచ్చారా అనే కోణంలో వివరణ కోరుతూ అధికారులు ఈ నోటీసులు పంపారు. అదనంగా, ఈ సంస్థ అక్రమ డబ్బుతో నిర్వహించిన 'కన్నడ ఉత్సవం' వేడుకల్లో పాల్గొన్న కన్నడ సినీ నటులు డాలి ధనుంజయ, సప్తమీ గౌడ, వశిష్ఠ సింహ, రాగిణి ద్వివేదికలకు నోటీసులు ఇచ్చేందుకు ఐడీ సిద్ధమైంది.

## నటి ప్రీతి ముకుందన్ ఆసక్తికర వ్యాఖ్యలు

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:** 'కన్నప్ప', 'బ్లాస్ట్' చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ బ్యూటీ ప్రీతి ముకుందన్ తన కెరీర్, పాత్రల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇకపై కేవలం అద్భుతమైన,వైవిధ్యమైన కథలను మాత్రమే ఎంచుకోవాలని ఫిక్స్ అయినట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం తను నటిస్తున్న సినిమాల్లో ప్రతి పాత్ర విభిన్నంగా ఉంటుందని ప్రీతి తెలిపారు. 'ఇదయం మురళి' చిత్రంలో సంప్రదాయబద్ధమైన పాత్రలో, 'దశమకన్' సినిమాలో అమాయకపు యువతిగా, అలాగే అశోక్ సెల్వన్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రంలో ఎంతో మెచ్యూర్డ్ రోల్‌లో కనిపిస్తున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు తనను గ్లామరస్ కమర్షియల్ పాత్రల్లో చూడాలని ఆశించారు. కథా బలం ఉన్న సినిమాలకే తాను మొగ్గు చూపుతానని చెప్పారు. ఈ ఏడాది తనవి 5 నుండి 6 చిత్రాలు విడుదలవుతాయని ఆశిస్తున్నాను.

భవిష్యత్తులో హిందీ సినిమాల్లో కూడా నటించాలనే తన కోరికను ఆమె బయటపెట్టారు.

**వైవిధ్యమైన పాత్రలకే నా ప్రాధాన్యత..**




# భారత్‌లో నోలన్ సినిమా క్రేజ్..

## 'ది ఒడిస్సీ' టికెట్ ధర రూ. 3,300.. అయినా హాట్ కేకుల్లా అమ్మకాలు!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ సినిమా వస్తోందంటే ఆ సందడే వేరు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం 'ది ఒడిస్సీ' విషయంలోనూ ఇదే జరుగుతోంది. నిన్న (జూన్ 8న) భారత్‌లో ఈ సినిమా ఐమ్యాక్స్ షోల కోసం అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా, టికెట్ ధరలు చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ముంబై, పూణె వంటి నగరాల్లో ప్రీమియం సీట్ల ధరలు ఏకంగా రూ. 3,000 నుంచి రూ. 3,300 వరకు పలుకుతున్నాయి. దేశంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సినిమా టికెట్లలో ఇవే అత్యంత ఖరీదైనవి కావడం గమనార్హం.


అయితే, ధరలు ఆకాశాన్నంటుతున్నా డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. బుకింగ్స్ ఓపెన్ అయిన నిమిషాల వ్యవధిలోనే పలు షోలకు సంబంధించిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఇది చూసి ట్రేడ్ విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, నగరాల మధ్య టికెట్ ధరల్లో ఇంత భారీ వ్యత్యాసం ఉండటంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఒకే సినిమా అనుభూతికి ఒక్కో నగరంలో ఒక్కో ధర ఎందుకుందని చాలా మంది అభిమానులు ప్రశ్నిస్తున్నారు.




# ఛీ, ఛీ.. వ్యూస్ కోసం..నడి రోడ్డుపై టవల్ డాన్స్‌తో రెచ్చిపోయిన యువతి.. నెటిజన్ల ఫైర్..!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** ప్రస్తుత రోజుల్లో సామాజిక మాధ్యమాలలో రాత్రికి రాత్రే సెలబ్రిటీ అయిపోవాలనే పిచ్చి జనాలను ఊహించని పనుల వైపు నడిపిస్తోంది. ప్రతిరోజూ వేలాది మంది రకరకాల రీల్స్ చేస్తూ ఇంటర్నెట్‌లో పోస్ట్ చేస్తున్నారు. సాధారణంగా ఎవరైనా విదేశాలకు విహారయాత్రకు వెళ్తే, అక్కడి అందమైన ప్రదేశాలలో మంచి దుస్తులు ధరించి ఫోటోలు, వీడియోలు దిగాలని ఆశపడతారు. కానీ, వైరల్ అవుతున్న ఈ తాజా వీడియో సమాజం ఎటు పోతుందోనని మరోసారి ఆలోచించేలా చేస్తోంది. కేవలం కొన్ని లైకులు, ఫాలోవర్ల కోసం ఒక యువతి తన ఆత్మగౌరవాన్ని, విచక్షణను ఎలా పక్కన పెట్టిందోనని నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.ఈ వైరల్ వీడియోలో ఒక భారతీయ యువతి విదేశాల్లోని ఒక పబ్లిక్ రోడ్డుపై కేవలం టవల్ మాత్రమే ధరించి అసభ్యకరంగా డ్యాన్స్ చేస్తూ కనిపించింది. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లోకి రాగానే నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి పనులు చేయడం అస్సలు సమర్థనీయం కాదని చాలా మంది మండిపడుతున్నారు. కేవలం ప్రచారం కోసం ఇంత దిగజారాలా అని ప్రశ్నిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తింపు తెచ్చుకోవాలనే ఆరాటంలో, తమ ప్రవర్తన సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో కనీసం ఆలోచించడం లేదని నెటిజన్లు వాపోతున్నారు.





# కాస్ట్లీ గిఫ్ట్ కోసం లవ్వాట.. అది అందగానే బ్రేకప్..

## పాపం..లీగల్ అడ్వైజ్ కోరుతున్న బాధితుడు!


**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** రూ. 3 లక్షల ఖరీదైన గిఫ్ట్ కోసం యువతి ప్రేమ నాటకమాడి, బహుమతి చేతికి అందగానే మరుసటి రోజే ప్రియుడికి బ్రేకప్ చెప్పిన విచిత్ర ఘటన యూకేలో వెలుగు చూసింది. బాధితుడు రెడ్‌ఇట్ వేదికగా షేర్ చేసిన ఈ స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.బాధితుడి కథనం ప్రకారం.. యూకేకు చెందిన ఒక యువకుడు, యువతి గత మూడేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారు.

ప్రియురాలి కోరిక మేరకు ఆమె పుట్టినరోజుకు ఆ యువకుడు రూ. 3.1 లక్షల విలువైన 'గేమింగ్ పీసీ'ని బహుమతిగా ఇచ్చాడు. అయితే, గిఫ్ట్ తీసుకున్న మరుసటి రోజే ఆమె అతనికి బ్రేకప్ చెప్పింది. నివ్వెరపోయిన యువకుడు ఆరా తీయగా.. ఆమె కొన్ని నెలల క్రితమే అతడిని వదిలేయాలని నిర్ణయించుకుందని, కానీ ఈ ఖరీదైన కంప్యూటర్ కోసమే ఇన్నాళ్లూ ప్రేమగా నటిస్తూ డ్రామా ఆడిందని ఆమె స్నేహితురాలి ద్వారా తెలిసింది. దీనికి సంబంధించిన చాటింగ్ స్క్రీన్ షాట్లు కూడా బాధితుడు సంపాదించాడు. యూకే చట్టాల ప్రకారం ఒకసారి కానుకగా (బహుమతి) ఇచ్చిన వస్తువుపై దాన్ని తీసుకున్న వారికే పూర్తి హక్కులు ఉంటాయి. కానీ, ఆమె తనను పక్కా ప్లాన్‌తో మోసం చేసిందని నిరూపించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, ఆ పీసీని లీగల్‌గా వెనక్కి తెచ్చుకునే అవకాశం ఉందా అని ఆ యువకుడు నెటిజన్‌లను న్యాయ సలహా కోరాడు. చట్టపరంగా స్పందించిన నెటిజన్లు.. చట్టపరంగా ఆమెదే పైచేయి అవుతుందని, కోర్టు ఖర్చులు దండగ కాబట్టి లైట్ తీసుకోవాలని కొందరు, స్మాల్ క్లెయిమ్స్ కోర్టును ఆశ్రయించి ఆమె అసలు రంగు బయటపెట్టాలని మరికొందరు సలహాలు ఇస్తున్నారు.

# ఫుల్ స్వింగ్‌లో 'కింగ్-100'షూటింగ్..

## ఆ తేదీకే థియేటర్స్‌లో సందడి!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 9:టాలీవుడ్ మన్మథుడు అక్కినేని నాగార్జున ఇప్పటికీ వరుస సినిమాలతో కుర్ర హీరోలకు గట్టి పోటీనిస్తున్నారు. ఆయన కొడుకులు అక్కినేని అఖిల్, అక్కినేని నాగచైతన్య కంటే యంగ్‌గా కనిపిస్తూ.. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఇకఆయన కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తుండగా.. ఇందులో టబు కీలక పాత్రలో నటిస్తోంది. నాగార్జునకు జోడీగా ఐశ్వర్య రాజేష్ హీరోయిన్‌గా కనిపించనుంది. యాక్షన్ డ్రామా ఎమోషన్స్ కలిపి దీనిని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ సైలెంట్‌గా దూసుకెళ్తోంది. అంతేకాకుండా దాదాపు షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. త్వరలోనే చిత్రీకరణ పూర్తి చేస పోస్ట్ ప్రొడక్షన్ పనులపై ఫోకస్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోందట. మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను విడుదల చేసేందుకు సోలో తేదీతో పాటు స్పెషల్‌గా థియేటర్స్‌లోకి తీసుకురావాలని మూవీ మేకర్స్ చూస్తున్నారట. ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీని ఈ ఏడాది దసరా పండుగ కానుకగా అక్టోబర్ 20కి థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్. టైటిల్ ఖరారు కానీ ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, టీజర్‌ను కూడా త్వరలోనే రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ అప్డేట్‌తో అక్కినేని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.



### ఊరెళ్లిన భార్య.. సాయంత్రం వచ్చి చూసేసరికి ఘోరం..

# స్థానికంగా కుదిపేసిన దారుణ ఘటన!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 9:** ఆడుకుంటూ, చదువుకుంటూ భవిష్యత్తు వైపు అడుగులు వేయాల్సిన 13 ఏళ్ల బాలుడు.. సొంత తండ్రి చేతిలోనే అత్యంత పాశవికంగా ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత అదే తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. కన్న కొడుకును గుండెల్లో పెట్టుకుని పెంచాల్సిన తండ్రే.. అతని పాలి కాలయముడుగా మారడం ప్రతి ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటన ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే..! నల్లగొండ జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అప్పాజీపేటకు చెందిన ట్రాన్స్‌కో జూనియర్ లైన్‌మ్యాన్ పబ్బతి లింగారెడ్డి తన 13 ఏళ్ల కుమారుడు ప్రణీత్‌రెడ్డిని సుత్తితో తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



అనంతరం లింగారెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య హైదరాబాద్‌కు వెళ్లిన భార్య కవిత సాయంత్రం ఇంటికి చేరుకుని తలుపులు తెరిపించగా, తండ్రీకొడుకులు మృత దేహాలుగా కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396